అభివృద్ధే లక్ష్యం

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- గుమ్మడిదల, బొంతపల్లి, వీరన్నగూడెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

గుమ్మడిదల: వీరన్నగూడెంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

గుమ్మడిదల/జిన్నారం, జనవరి 31: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా, అన్ని గ్రామాలను మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం గుమ్మడిదలతోపాటు బొంత పల్లి, వీరన్నగూడెం గ్రామాల్లో రూ.2.22 కోట్ల నిధులతో పూర్తి చేసిన సీసీ రోడ్లు, యూజీడీ పనులను ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బొంతపల్లి పంచాయతీలో విధులు నిర్వహించిన భీంసింగ్, వీరస్వామి కుటుంబాలకు రూ.50 వేల చొప్పు న నగదును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతోపాటు అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించామని చెప్పారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో సూపర్‌మల్టీ స్పెషాలిటీ దవాఖానను త్వరలో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సద్ది ప్రవీణావిజయ భాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్ గౌడ్, సర్పంచ్‌లు చిమ్ముల నర్సింహారెడ్డి, మమతావేణు, రాజశేఖర్, ఎంపీటీసీ నాగేందర్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, గటాటి భద్ర ప్ప, విజయభాస్కర్‌రెడ్డి, నక్క వెంకటేశ్‌గౌడ్, గౌరీశంకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు మహ్మద్ హుస్సేన్, ఉపసర్పంచ్‌లు మొగులయ్య, దేశబోయిన కుమార్, సంజీవరెడ్డి, నాయకులు యాదగిరి, మోహన్, ఇజాజ్‌పాషా, చక్రపాణి, వినోద్ గౌడ్, ముద్దంగుల గోపాల్, గోపాల్‌రెడ్డి, ఈవో శ్రీనివాస్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

జిన్నారంలో..

పటాన్‌చెరు నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు గ్రామాల సమస్యలను తెలుసుకుంటూ అవసరమైన నిధులను కేటాయిస్తున్నామని తెలిపారు. బుధవారం మండలంలోని సోలక్‌పల్లి, ఇమామ్‌నగర్ గ్రామాల్లో రూ.25 లక్షల వ్యయంతో ఏర్పా టు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణం, పల్లె ప్రకృతి వనం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. అనంతరం స్థానిక సర్పం చ్ శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వెంకటేశంగౌడ్, సర్పంచ్‌లు చెట్టి శివరాజ్, జనార్దన్, ఆంజనేయులు, ఖాజీపల్లి ఎంపీటీసీ ఆకుల భార్గవ్, పీఆర్ఏఈ మల్లేశ్, ఉపసర్పంచ్ వనజాకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజేశ్, నాయకులు వై ప్రభాకర్‌రెడ్డి, జగన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణాగౌడ్, బత్తుల మహేశ్, శ్రీకాంత్‌గౌడ్, పెంటేశ్, పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గ్రామాలు

పటాన్‌చెరు, జనవరి 31: నియోజకవర్గంలో గ్రామాలను అభివృద్ధిలో ముందుంచానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల, చిన్నకంజర్ల గ్రామా ల్లో రూ.3కోట్ల 70లక్షలతో పలు అభివృద్ధి పనులను, సీసీ రోడ్లు, మహిళాభవనం, కమ్యూనిటీ ఫంక్షన్ హాళ్లను ప్రారంభించారు. జడ్పీటీసీ సుప్రజా వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌లు రాజ్‌కుమార్, నారాయణరెడ్డి, ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

రెడ్డిఖానాపూర్‌లో ముదిరాజ్ సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హత్నూర, జనవరి 31: మండల పరిధి రెడ్డిఖానాపూర్‌లో బుధవారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామంలో నూతనంగా రూ.28లక్షలతో నిర్మించిన ముదిరాజ్ సంఘం, యాదవ సంఘం భవనాలతోపాటు, రూ.75లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, మురుగు కాలువలు, హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, పీఏసీఎస్ చైర్మన్లు దామోదర్‌రెడ్డి, దుర్గారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ వనజావీరేశం, నాయకుడు వెంకటేశంగుప్తా, సభ్యులు పాల్గొన్నారు.

పాత పంటలకు మద్దతు ధర కల్పించాలి

జహీరాబాద్ పట్టణంలో పాత పంటల జాతర

జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పాత పంటల జాతరను ప్రారంభిస్తున్న ఏవో ప్రవీణ, డిగ్రీ కళాశాల అధ్యాపకులు

జహీరాబాద్, జనవరి 31: మహిళా రైతులు చిరుధాన్యాలు సాగు చేసేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందని పలువురు పేర్కొన్నారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాల మైదానం నుంచి పాత పంటలతో అలంకరణ చేసిన ఎడ్ల బండ్లతో ర్యాలీ నిర్వహించారు. గిరిజన మహిళలు పాత పంటల పాటలతో నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. పాత పంటలో అనేక పోషకాలు ఉంటాయని, ప్రతి ఒక్కరూ పాత పంటలను ఆహారంగా తీసుకొనేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. సన్న, చిన్నకారు రైతులు చిరుధాన్యాల పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. వర్షాధారంగా చిరుధాన్యాల పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. చిరుధాన్యాలకు మద్దతు ధర కలిపించి, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ, డిగ్రీ కళాశాల అధ్యాపకులు రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖోకు ఎంపిక

కల్హేర్, జనవరి 31 : గజ్వేల్‌లో నిర్వహించిన సీనియర్ బాలికల ఖోఖో పోటీలో కల్హేర్ మండలం కృష్ణాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన నలుగురు క్రీడాకారిణులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో ఉన్నత పాఠశాలకు చెందిన గాయత్రి, సంయుక్త, వర్ష, కవిత, హర్షిత, సౌమ్య, పూజ, శ్రీలత, మధు, ప్రియ, హారిక రెండో స్థానం సాధించారన్నారు. ఈ నెల 9,10,11తేదీల్లో నల్లగొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటారన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కంది, జనవరి 31: రక్తదానం ప్రాణదానంతో సమానమని మోటర్ వెహికిల్ శాఖ అధికారి కిరణ్‌కుమార్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం కందిలోని ఆర్‌టీఏ కార్యాలయంలో ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత జాగ్రత్తలు పాటించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతిఒక్కరూ సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పక వాడలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటిస్తూ జాగ్రత్తగా రోడ్లు దాటాలన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా రక్తదానం చేయడం సంతోషంగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో మోటర్ మెహికిల్ అధికారులు కృష్ణవేణి, శ్రీనివాస్, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి చందర్, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జ్ రాజు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

సంగారెడ్డి, జనవరి 31: రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని ఆర్టీఏ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బుధవారం రక్తదాన శిబిరాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో మోటర్ వెహికల్ అధికారులు కిరణ్, కృష్ణవేణి, శ్రీనివాస్‌లతోపాటు మొత్తం 46 మంది సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి చందర్, వైద్యాధికారి నరేశ్, బ్లడ్ బ్యాంక్ సమన్వయ కర్త రాజులతోపాటు రెడ్‌క్రాస్ వలంటీర్లు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు సన్మానం

సర్పంచ్‌లను సన్మానించిన అధికారులు

కొండాపూర్ జనవరి 31 : మండల కేంద్రమైన కొండాపూర్‌లో బుధవారం మండలాభివృద్ధి కార్యాలయ సిబ్బంది కొండాపూర్ మండలంలోని 24 గ్రామాల పంచాయతీ సర్పంచ్‌లను, ఉప సర్పంచ్‌లను ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ మండల అధికారులు ఐదేండ్లుగా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పాలనకు పూర్తిగా సహకరించినందుకు వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం రేపటితో ముగియడంతో ఈ సమావేశం ఏర్పాటు చేశామని మండల అధికారులు తెలిపారు.

అభివృద్ధిలో ఆదర్శం

మునిపల్లి, జనవరి 31: మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ప్రత్యేక చొరవతో మండలంలోని భూసారెడ్డిపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అదర్శగ్రామంగా తీర్చిదిద్దినట్లు సర్పంచ్ స్వప్నాశశికుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని భూసారెడ్డిపల్లిలో సర్పంచ్ స్వప్నాశశి కుమార్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి మంతురి శశికుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ఎల్లంకిలో అంతర్జాతీయ సదస్సు

ఎల్లంకిలో అంతర్జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న ప్రతినిధులు

పటాన్‌చెరు, జనవరి 31 : ఎల్లంకి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అటానమస్ కళాశాలలో రెండు రోజుల అంతర్జాతీయ సందస్సు జరిగింది. ఇంటర్నెషనల్ కాన్ఫరెన్స్ సైన్స్ టెక్నాలజీ ఇంజినీరింగ్ మెనేజ్‌మెంట్ (ఐసీఎస్‌టీఈఎం 2023-24) ఎల్లంకి కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా రెక్టార్ జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ గోవర్ధన్ పాల్గొని మాట్లాడారు. గెస్ట్ ఆఫ్ హానర్‌గా డాక్టర్ సీవో తవీ, సెక్రటరీ దయాకర్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సాయికుమార్, ప్రిన్సిపాల్ జాన్‌పాల్ పాల్గొన్నారు.

శివాజీ ఆశయాలతో ముందుకు సాగాలి

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

అమీన్‌పూర్, జనవరి 31: ఛత్రపతి శివాజీ ఆశయాలతో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్ మండలపరిధిలోని పటేల్‌గూడలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి, స్వామి వివేకానంద, ఛత్రపతి శివాజీ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దేశానికి సేవచేసిన మహనీయులను స్మరించుకొని వారి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. పటాన్‌చెరు నియోజవర్గంలో పూర్తి పారదర్శకతతో సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ దేవానంద్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ నీతిషా శ్రీకాంత్, గ్రామ పాలవర్గ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు చేయాలి

సదాశివపేట, జనవరి 31 : రైతుల వద్ద నుంచి సీసీఐ పత్తి కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని ఆత్మకూర్ శివారులో గల అన్నపూర్ణ జిమ్మింగ్ మిల్ వద్ద రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. సీసీఐ కొనుగోలు చేయకపోవడం వల్ల ప్రైవేటు వ్యాపారులు పెద్ద ఎత్తున దోపిడి చేస్తున్నారన్నారు. సీసీఐ రూ.7020 కొనుగోలు చేస్తే ప్రైవేటు వ్యాపారులు రూ. 5 వేల నుంచి రూ. 6 వేల వరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ నాయకులు భూషణం, ఏసోబు, ప్రసాద్, రైతులు జగదీశ్, భాస్కర్, రవి, బాలమని, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని దుకాణాల తొలిగింపు

జిన్నారం, జనవరి 31: ఖాజీపల్లి పంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 181 ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన దుకాణాలను రెవెన్యూ అధికారులు బుధవారం తొలిగించారు. తహసీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు శంభీపూర్ గ్రామ సమీపంలో 181 సర్వేనంబర్‌లో ఏర్పాటు చేసిన పలు దుకాణాలను ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ జేసీబీలతో తొలిగించారు. అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిలో దుకాణాలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

గురుకులంలో సైన్స్ ఫెయిర్

జిన్నారం, జనవరి 31: గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు సైన్స్ ఫెయిర్, రంగోలి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు తరగతి గదిలో సైన్స్, గణితానికి సంబంధించిన పలు అంశాలను ముగ్గుల రూపంలో వివరించారు. ముగ్గుల రూపంలో వివరించడం వల్ల విద్యార్థులకు చాలారోజులు గణిత, సైన్స్ అంశాలు గుర్తుంటాయన్నారు. ఇలాంటి కార్యక్రమా లు నిర్వహించిన జన్య ఫౌండేషన్ వారికి ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు

జడ్సీని కలిసిన కార్పొరేటర్

జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, జనవరి 31: వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన స్నేహశబరీష్‌ని బుధవారం ఆర్సీపురం డివిజన్ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డివిజన్‌లో ఉన్న సమస్యలను ఆమెకు వివరించి వినతిపత్రం అందజేశారు. త్వరలోనే అధికారులతో సమీక్ష జరిపి, స్వయంగా డివిజన్‌లో పర్యటిస్తానని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

అభివృద్ధిపై దృష్టి సారించండి

- అసంపూర్తి పనులను వేగంగా పూర్తి చేయాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

నారాయణఖేడ్, జనవరి 31: నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు సూచించారు. బుధవారం జూకల్ శివారులోని కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డితో కలిసి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ రాజ్, నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ పనుల పురోగతిపై ఆరా తీశారు. గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నల్లవాగు ప్రాజెక్టు ఆధునీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్యను పెంచే దిశగా కృషి చేయాలని, సాధారణ ప్రసవాలు జరిగే విధంగా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్న విషయమై విద్యాధికారి వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. మనఊరు-మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనుల పురోగతిపై సమీక్షించిన కలెక్టర్ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల ఏర్పాటుపై అధికారులకు కచ్చితమైన ఆదేశాలిచ్చారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ప్రతి గ్రామానికీ మంచినీరు సరఫరా అయ్యేవిధంగా చూడాలన్నారు. మినీ అంగన్‌వాడీలను అంగన్‌వాడీ టీచర్లుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా ఐదుగురికి కలెక్టర్, ఎమ్మెల్యే ఉత్తర్వులు అందజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్డీవో శ్రీనివాస్‌రావు, డీపీవో సురేశ్‌మోహన్, జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు, ఆర్డీవో వెంకటేశ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలను సంరక్షించుకుందాం

తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్

తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్‌ను సన్మానిస్తున్న మత్స్య సహకార సంఘం సభ్యులు

జిన్నారం/గుమ్మడిదల జనవరి 31 : హైదరాబాద్ మహానగరం చుట్టూ ఉన్న చెరువులు, కుంటలను సంరక్షించుకోవాలని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ ఫిషరీస్ సొసైటీ ఆధ్వర్యంలో జిన్నారం మండలంలోని గడ్డ పోతారంలో నూతన కమిటీ బాధ్యుల ప్రమాణస్వీకారానికి ఆయన ము ఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు సుంకరబోయిన మహేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పిట్టల రవీందర్ మాట్లాడారు. హైదరాబాద్ మహానగరానికి ఆనుకొని ఉన్న పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని చెరువులు, కుంట లు రియల్ మాఫియా కారణంగా కనుమరుగవుతున్నాయన్నారు. మరోవైపు పరిశ్రమల కాలుష్యం ఫలితంగా చెరువులు, కుంటలు ఉన్నా అందులో చేపల పెంపకం అసాధ్యమని ఆందోళన వ్యక్తం చేశారు. పారిశ్రామిక ప్రాంతంలోని మత్స్యకారులతో పాటు ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు తెలంగాణ ఫిషరీస్ సొసై టీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చెరువులు, కుంటల్లోకి పరిశ్రమలు కాలుష్యం వదుపీలుకున్నా పీసీబీ అధికారులు స్పందించడం లేదన్నారు. మాణిక్‌రావు, మల్లేశ్, ఆది ఎల్లయ్య సభ్యులు పాల్గొన్నారు.

ఎండు గంజాయి పట్టివేత

హత్నూర, జనవరి 31: పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు ఎండు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని హత్నూర పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకొని కిలోన్నర ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బీహార్‌కు చెందిన ప్రేమ్‌కుమార్ కుటుంబసభ్యులతో కలిసి కొన్నేండ్లుగా హత్నూర మండలం మల్కాపూర్ శివారులోని వీఎస్ఆర్ గార్డెన్ సమీపంలో గుడారం వేసుకొని నివాసం ఉంటున్నాడు. స్థానిక పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు గుట్టుచప్పుడు కాకుండా ఎండు గంజాయి విక్రయిస్తున్నాడు. ప్రేమ్‌కుమార్ కుటుంబీకులు పరిశ్రమల్లో పనిచేస్తూ కార్మికులను పరిచయం చేసుకుంటూ వారికి గంజాయి విక్రయించడంతోపాటు మత్తుపదార్థాలతో కూడిన చాక్లెట్లను అమ్ము తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో బుధవారం గంజాయి అమ్ముతున్న స్థావరంపై దాడిచేసి కిలోన్నర ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రేమ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు జిన్నారం సీఐ వేణుకుమార్, ఎస్సై సుభాశ్ తెలిపారు.

కలుషిత నీరుతాగి మేకలు మృతి

కోహీర్, జనవరి 31: రసాయన మందు కలిపిన కలుషిత నీరు తాగి పది మేకలు మృత్యువాత పడిన ఘటన ఖానాపూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకొంది. బాధిత రైతు హన్మయ్య తెలిపిన వివరాల ప్రకారం..ఖానాపూర్ గ్రామానికి చెందిన రైతు హన్మయ్య పశుగ్రాసం కోసం మేకలను పొలం వద్దకు తోలుకుపోయాడు. దాహం వేయడంతో మేకలు పక్కపొలం వద్ద ఉన్న బకెట్‌లో నీటిని తాగాయి. కొద్దిసేపటికి పది మేక లు చనిపోయాయి. పంట ఎదుగుదల కోసం రసాయన మందును నీటిలో కలిపారు. కానీ హన్మయ్యకు తెలియకపోవడంతో మేకలకు బకెట్‌లోని నీటిని తాగించాడు. దీంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. పది మేకల విలువ రూ.1.40లక్షల వరకు ఉంటుందని, నిరుపేదనైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

భక్తులకు సన్మానం

బొల్లారం, జనవరి 31: బొల్లారం మున్సిపాలిటీకి చెందిన పలువురు భక్తులు తిరుమల తిరుపతికి పాదయాత్రగా వెళ్తుండగా కర్నూలు జిల్లా ఓర్వకల్ సమీపంలో మార్గ మధ్యమున బీఆర్ఎస్ నాయకుడు, కౌన్సిలర్ చంద్రారెడ్డి వారిని ఆత్మీయంగా పలకరించి సన్మానించారు. లోక కల్యాణం కోసం తలపెట్టిన మహా పాదయాత్ర జయప్రదంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు, నాయకులు సంపత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర చేస్తున్న బొల్లారం వాసులను సన్మానిస్తున్న నాయకులు

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

సంగారెడ్డి, జనవరి 31 : మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురిలో ఒకరికి జైలు, నలుగురికి రూ.10 వేల చొప్పున జరిమాన విధిస్తూ ఎక్సైజ్ మార్నింగ్ కోర్టు న్యాయమూర్తి తేజస్వి తీర్పునిచ్చారని ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులను కోర్టులో హాజరపర్చడంతో న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. 5మందికి (ఒక్కరికి 5 రోజుల జైలు, నలుగురికి రూ.10 వేల చొప్పున) జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు.

మిషన్ భగీరథ నీటి వృథా

వృథా అవుతున్న మిషన్‌భగీరథ నీరు

ఝరాసంగం, జనవరి 31 : మండలంలోని మిషన్ భగీరథ సెక్షన్ పరిధిలో నిత్యం పలుచోట్ల పైపులైన్లు లీకేజీ అవుతుండడంతో తాగునీరు వృథాగా పోతుంది. బుధవారం ఝరాసంగం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన మిషన్ భగీరథ నీరు ఎయిర్‌వాల్ దగ్గర వృథా కావడంతో నీళ్లు రోడ్డు పక్కన ఉన్న కాలనీలలో నిండిపోయాయి దీంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల పరిధిలోని మేదపల్లి, ప్యారవరం, దేవరంపల్లి, జీర్లపల్లి, కృష్ణపూర్, బిడెకన్నె గ్రామాల్లో ఆరు నెలలుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాక పంచాయతీ బోర్లపై ప్రజలు ఆధారపడి నీటిని అరకొరగా పట్టుకొని తాగుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ లీకేజీలను గుర్తించి, తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో పోలీస్ యాక్టు అమలు

సంగారెడ్డి, జనవరి 31 : జిల్లాలో నెల రోజుల పాటు 30 పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని, పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెన్నూరి రూపేశ్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు 30, 30(ఎ) పోలీస్ చట్టం 1861 ప్రకారం జనవరి 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 వరకు అమలులో ఉంటుందని సూచించారు. ముందస్తు పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు, నిరాహార దీక్షలు నిర్వహించరాదన్నారు. అనుమతి లేకుండా సమావేశాలు ఏర్పాటు చేస్తే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కస్తూర్బా గాంధీ పాఠశాల తనిఖీ

ఝరాసంగం, జనవరి 31 : మెనూ ప్రకారం ప్రతిరోజు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ సంజీవరావు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించాల్సిన భోజనంలో కూరగాయ, ఆకుకూర పప్పుతో పాటు నెయ్యి, పెరుగు పెట్టాల్సి ఉండగా కట్టుచారు, వంకాయ, ఆకు కూర లేని పప్పు, పెరుగు మాత్రమే విద్యార్థులకు వడ్డించడంపై తహసీల్దార్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు, లేనిచో కఠినమైన చర్యలుంటాయని అన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

కొండాపూర్, జనవరి 31: మండల కేంద్రమైన కొండాపూర్‌లో బుధవారం స్థానిక సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు ఎండీ.రుక్మోద్దీన్ ఆధ్వర్యంలో ఎంపీపీ మనోజ్‌రెడ్డి 50 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరిగినా తెలుసుకోవడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పద్మావతీపాండురంగం, మాజీ సర్పంచ్ సత్యానంద, మాజీ ఎంపీటీసీ శ్యాంరావు, ఉపసర్పంచ్ రవి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

న్యూలాండ్ సహకారం అభినందనీయం

జిన్నారం, జనవరి 31: జిన్నారంలోని ప్రాథమిక ప్రభుత్వ ఆరోగ్యకేంద్రానికి న్యూలాండ్ పరిశ్రమ అందించిన సహకారం అభినందనీయమని ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. పీహెచ్‌సీకి ఫర్నిచర్, ఫ్రిడ్జ్, వాటర్ ఫిల్టర్, పల్స్‌మిషన్, ప్రింటర్‌ను బుధవారం న్యూలాండ్ పరిశ్రమ అందజేయగా, ఎంపీటీసీ లావణ్యానరేశ్, పరిశ్రమ ప్రతినిధులతో కలిసి ఎంపీపీ దవాఖాన సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీకి అవసరమైన పరికరాలను అడిగిన వెంటనే అందించిన పరిశ్రమకు ధన్యవాదాలు తెలిపారు. జిన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవసరమైన పరికరాలను, ప్రొజెక్టర్‌ను అందించాలని ఎంపీటీసీ లావణ్యానరేశ్ న్యూలాండ్ పరిశ్రమ ప్రతినిధులకు వినతిపత్రాన్ని అందజేశారు. పీహెచ్‌సీ వైద్యురాలు కోమల్, బాల్‌రాజ్, పరిశ్రమ ప్రతినిధులు హేమచంద్ర, డీవీరెడ్డి, సీహెచ్.రవి, శ్రీహర్ష, రామకృష్ణ, పీహెచ్‌సీ సిబ్బంది శివతేజ, వార్డు సభ్యులు నవ్యమహేందర్, శ్రీధర్, శ్రీనివాస్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.